సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
మంగళవారం । 23 । జనవరి । 2024



మల్హర్: మల్లారం హనుమాన్ ఆలయంలో భక్తులు

న్యూస్‌రీల్

బాలికలకు సమాన అవకాశాలు కల్పించాలి



మహదేవపూర్/పలిమెల: సమాజంలో బాలికలకు సమాన అవకాశాలు కల్పించాలని మహిళా సాధికారత జిల్లా ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ అనుష అన్నారు. బాలికల హక్కులపై విద్యార్థినులకు సోమవారం అంబట్‌పల్లి జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల, పలిమెల కేజీబీవీలో అవగాహన కల్పించారు. అనంతరం అనూష మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాలికలకు విద్య, వైద్యం, పోషకాహారం అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి రాజకొమురయ్య, జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు వెంకటరాజం, కౌన్సిలర్ శైలజ, మమత, సురేష్ పాల్గొన్నారు.

సర్పంచ్‌కు జాతీయ అవార్డు



మహదేవపూర్: ఉత్తమ సేవలు అందించిన మహదేవపూర్ సర్పంచ్ శ్రీపతి బాపుకు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అవార్డు లభించింది. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్‌ఏ) జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ అవార్డు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలు అందిస్తున్న వారికి ప్రతి సంవత్సరం అకాడమీ ఆధ్వర్యంలో అవార్డు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడు విష్ణు, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, సెలక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఐలయ్య, బీసీ సంఘం జిల్లా బాధ్యుడు సమ్మయ్య పాల్గొన్నారు.

బోనమెత్తిన లక్ష్మీదేవర



కాళేశ్వరం: డప్పు చప్పుళ్లు.. కాళ్ల గజ్జెల సవ్వడులు.. శివసత్తులు కేరింతలతో లక్ష్మీదేవర గుడి వద్ద బోనాల పండుగను భక్తులు ఘనంగా నిర్వహించారు. మహదేవపూర్ మండలం కాళేశ్వరం ఎస్టీ కాలనీలోని లక్ష్మీదేవర గుడి వద్ద భక్తులు బోనమెత్తి మొక్కులు చెల్లించారు. బోనాలతో మహిళలు గుడి చుట్టూరా తిరిగి బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి విరాళం



చిట్యాల: మండలకేంద్రంలో నిర్మించనున్న రామాలయ నిర్మాణానికి మండలకేంద్రానికి చెందిన కట్కూరి తిరుతమ్మ-మొగిలి దంపతులు రూ.51,116 విరాళం ప్రకటించారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో భాగ ంగా వారు విరాళానికి సంబంధించిన చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

కేజీబీవీ ఆకస్మిక తనిఖీ



మహదేవపూర్: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి కిషన్‌రావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల పాఠశాలలో నాలుగు సిలిండర్లు చోరీకి గురవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. వారం రోజుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

30న స్థాయీ సంఘాల సమావేశం

భూపాలపల్లి రూరల్: ఈ నెల 30న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి అధ్యక్షతన జెడ్పీ కార్యాలయంలో ఏడు స్థాయీ సంఘాలకు సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలకు జెడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

జై శ్రీరామ్

ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పలుచోట్ల భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాట్లు
- అన్నదానం, భజన కార్యక్రమాలు..

అయోధ్యలో సోమవారం శ్రీరామ్‌లల్లా విగ్రహప్రతిష్ఠ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా శ్రీరామ నామ స్మరణతో ఆలయాలు మారుమోగాయి. రామమందిరాలు, హనుమాన్ దేవాలయాలతో పాటు అన్ని ఆలయాల్లో ఉదయంనుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు భారీఎత్తున హాజరయ్యారు. అయోధ్య నుంచి ప్రత్యక్ష ప్రసారాన్ని భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌లలో భక్తులు తిలకించారు. జిల్లాకేంద్రం సుభాష్‌కాలనీలోని సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్‌లో అన్నదానం నిర్వహించారు. కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధ దేవాలయం శ్రీరామాలయంలో భక్తులు భజన కీర్తనలు ఆలపించారు.

– భూపాలపల్లి రూరల్/ కాళేశ్వరం/ టేకుమట్ల/ మల్హర్

– మరిన్ని ఫొటోలు 11లో▸



టేకుమట్ల: ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



భూపాలపల్లి రూరల్: పూజలో పాల్గొన్న భక్తులు



కాళేశ్వరం: భజన కీర్తనలు ఆలపిస్తున్న భక్తులు



కాళేశ్వరం: శ్రీరామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ప్రత్యేకాధికారుల పాలనే..!

10రోజుల్లో ముగియనున్న సర్పంచ్‌ల పదవీకాలం
- ఇప్పటికిప్పుడు ఎన్నికలు కష్టమే..
- 'పార్లమెంట్' తర్వాతే అంటూ ప్రచారం
- రిజర్వేషన్ల మార్పుపై సందిగ్ధం
- ఏకకాలంలో స్థానిక సంస్థల ఎన్నికలు..?



మొట్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

మొగుళ్లపల్లి: ఫిబ్రవరి రెండో తేదీన సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుండడంతో ప్రత్యేకాధికారుల పాలన మొదలయ్యే అవకాశాలు ఉన్నాయి. కేవలం పది రోజులు మాత్రమే సమయం ఉండగా ఇప్పటి వరకు ఎన్నికలకు సంబంధించి ఎలాంటి ప్రక్రియ కూడా ప్రారంభం కాలేదు. పార్లమెంట్ ఎన్నికల అనంతరమే సర్పంచ్ ఎన్నికలకు ప్రభుత్వం వెళ్లే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఇదే నిజమైతే ఫిబ్రవరి మూడో తేదీ నుంచి గ్రామపంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన మొదలుకానుంది.

జిల్లాలో 11 మండలాలు ఉన్నాయి. 241 గ్రామ పంచాయతీలు ఉండగా 2,062 వార్డులు ఉన్నాయి. గతంలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించారు. ఫిబ్రవరి రెండో తేదీతో సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుంది. జిల్లా యంత్రాంగం గ్రామ పంచాయతీల ఎన్నికలకు ఏర్పాట్లు చేసింది. పోలింగ్ కేంద్రాలు, అవసరమైన సిబ్బంది, ఓటర్ల గుర్తింపు, 650మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటుపై కసరత్తు చేసింది. ఈ మేరకు కలెక్టర్ రాష్ట్ర ఎన్నికల సంఘానికి వివరాలు పంపారు. పది రోజులు మాత్రమే సమయం ఉండడంతో ఇప్పటికిప్పుడు ఎన్నికల నిర్వహణ సాధ్యమయ్యే పరిస్థితి లేకపోవడంతో ప్రభుత్వం ఆమోదం తెలుపలేదు. దీంతో నిర్దేశిత గడువులోపు ఎన్నికలు జరిగే అవకాశం లేదు. ప్రత్యేకాధికారుల పాలన తప్పనిసరి అని అధికారులు చెబుతున్నారు. స్పెషలాఫీసర్లుగా నియమించేందుకు అర్హులైన పంచాయతీరాజ్, రెవెన్యూ విభాగాల్లోని సూపరింటెండెంట్, వ్యవసాయ అధికారులు, పశు వైద్యాధికారులు, ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన ఏఈలను,జూనియర్, సీనియర్ అసిస్టెంట్లతోపాటు ఎంపీఓలు, ఎంపీడీఓలు, తదితర విభాగాల నుంచి నియమించే అవకాశాలు ఉన్నాయి. మేజర్ పంచాయతీలకు జిల్లాస్థాయి అధికారులను నియమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

రిజర్వేషన్లపై సందిగ్ధం..

పదేళ్లపాటు రిజర్వేషన్లు ఉండేలా నూతన పంచాయతీరాజ్ చట్టంలో పొందుపర్చారు. 2018 సంవత్సరంలో ఎన్నికలు నిర్వహించిన సమయంలో నిర్దేశించిన రిజర్వేషన్లు పదేళ్లపాటు అమల్లో ఉంటాయని వెల్లడించారు. ప్రస్తుత ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను పెంచుతామని ఎన్నికల హామీలో ప్రకటించింది. బీసీ గణన చేపట్టి ఆయా గణాంకాల ఆధారంగా రిజర్వేషన్లు నిర్ధారిస్తామని వెల్లడించింది. పంచాయతీల సంఖ్య పెరిగిన నేపథ్యంలో రిజర్వేషన్ల మార్పు తప్పనిసరిగా కనిపిస్తుంది. ఈ విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

లోక్‌సభ ఎన్నికలే టార్గెట్..

షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్‌లో పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్నాయి. ఫిబ్రవరి నెలాఖరు లేదా మార్చి మొదటి వారంలో కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉండడంతో అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీజేపీ, బీఆర్‌ఎస్, తదితర రాజకీయ పక్షాలు లోక్‌సభ ఎన్నికలపైనే దృష్టి సారించాయి. ఇప్పటికే ఆయా పార్టీలకు చెందిన నాయకులతో సమావేశాలు నిర్వహించడం, ఎన్నికల్లో గెలుపు వ్యూహాలు రచించడంపై ఫోకస్ పెట్టాయి. జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు సన్నద్ధం అవుతున్నట్లు తెలిసింది.

పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా అవకాశం లేదు..

నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసిన వెంటనే ఎన్నికలు నిర్వహించాలి. ప్రస్తుత సర్పంచ్‌లను గతంలో మాదిరిగా పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా నియమించే అవకాశం లేదు. దీంతో పదవీకాలం పూర్తయిన వెంటనే వారి స్థానంలో ప్రత్యేకాధికారుల ద్వారా ప్రభుత్వం పరిపాలన సాగించాల్సి ఉంటుంది. లేదంటే ఇప్పటికిప్పుడు నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించాలి. ఇది సాధ్యమయ్యే పని కాదు. ఈ కారణంగా ప్రభుత్వం ప్రత్యేకాధికారుల నియామకానికే పచ్చ జెండా ఊపే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది.

నిర్ణయం ప్రభుత్వానిదే..



ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది వివరాల సేకరణ పూర్తి చేశాం. ప్రత్యేకాధికారుల పాలన, ప్రస్తుత సర్పంచ్‌లనే పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా కొనసాగించడమా అనే నిర్ణయం ప్రభుత్వానిదే.

– ఆశాలత, జిల్లా పంచాయతీ అధికారి

సర్పంచ్‌లనే కొనసాగించాలి..



ప్రస్తుత సర్పంచ్‌లనే పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగించాలి. పెండింగ్ బిల్లులు చెల్లించాలి. ప్రత్యేకాధికారులను నియమించాలన్న ఆలోచనను విరమించుకోవాలి. కరోనాతో రెండేళ్లు అభివృద్ధి కుంటుపడింది. ఆరు నెలల పాటు చెక్ పవర్ ఇవ్వలేదు. సర్కారు న్యాయం చేయాలి.

– చదువు అన్నారెడ్డి సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, మొగుళ్లపల్లి

సమస్యలకు సత్వర పరిష్కారం

కలెక్టర్ భవేష్‌మిశ్రా



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా

భూపాలపల్లి అర్బన్: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతతో వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు.

పెండింగ్ నిధులు విడుదల చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు

చిట్యాల: పెండింగ్ నిధులు విడుదల చేయాలని కోరుతూ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్ష, కార్యదర్శులు కామిడి రత్నాకర్‌రెడ్డి, సిద్దంకి భాస్కర్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం నిధులు తీసుకొచ్చి పనులుచేస్తే ఇంతవరకు నిధులు రాకపోవడంతో అప్పులతో అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న నిధులు విడుదల చేయాలని కోరారు. గ్రామాలలో చేసిన పనులకు ప్రభుత్వం వెంటనే నిధులను విడుదల చేయాలని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి నిధులు (ఎస్‌ఎఫ్‌సీ) దాదాపు 18 నెలలు నుంచి గ్రామ పంచాయతీలకు జమ చేయకపోవడం మూలంగా గ్రామంలో అభివృద్ధి కుంటుపడుతుందని తెలిపారు. తక్షణమే ఆ నిధులను కూడా విడుదల చేయాలని కోరారు. చెక్ పవర్‌ను కొనసాగించాలని పేర్కొన్నారు. కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు దామెరబోయిన నారాయణరావు, గజ్జి రవి, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి అర్బన్: సమస్యల పరిష్కారం కోసం పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ కిరణ్‌ఖరే ఆదేశించారు. సోమవారం ప్రజాదివస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ మండలాల నుంచి వచ్చిన 12మంది బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులపై మండలాల పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితుల సమస్యలపై విచారణ జరిపి, తగు చర్యలు తీసుకొని నివేదికను అందజేయాలని ఆదేశించారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.

110 జీఓ అమలు చేయాలి

భూపాలపల్లి అర్బన్: భాషా పండితులకు పదోన్నతులు కల్పించేందుకు జీఓ నంబర్ 110ని అమలు చేయాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ (ఆర్‌యూపీపీ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిల్షాద్, వేణు కోరారు. సోమవారం రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖను కలిసి కోరారు. అనంతరం యూనియన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. భాషా పండితులకు దశాబ్దకాలంగా ప్రమోషన్లు లేకుండానే పదవీ విరమణ అవుతున్నారని తెలిపారు.

ఆదరణను ఓర్వలేకనే దాడులు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- కాంగ్రెస్ పార్టీ నాయకుల నిరసన ర్యాలీ



నిరసన ర్యాలీలో ఎమ్మెల్యే గండ్ర, నాయకులు

భూపాలపల్లి రూరల్: దేశంలో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే బీజేపీ గుండాలు రాహుల్‌గాంధీపై దాడులు చేస్తున్నారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. అసోంలో భారత్ జోడో యాత్రలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీపై జరిగిన దాడిని ఖండిస్తూ సోమవారం రాత్రి జిల్లాకేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కార్యకర్తలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. హనుమాన్ దేవాలయం నుంచి జయశంకర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో పాటు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. బీజేపీకి దేశవ్యాప్తంగా ప్రజలు, యువత, కార్మికులు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, కౌన్సిలర్లు ముంజాల రవీందర్, దాట్ల శ్రీను, నాయకులు చల్లూరి మధు, బుర్ర కొండయ్య, అప్పం కిషన్, సాంబమూర్తి, , అంబాల శ్రీనివాస్, కరుణాకర్, పిప్పాల రాజేందర్, సంతోష్ మధూకర్‌రెడ్డి, బుచ్చయ్య, సమ్మిరెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.

మానవులంతా ఐక్యతతో మెలగాలి..

మానవులంతా ఐక్యతతో మెలగాలని, కలిసి మెలిసి ఉండాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలో మర్కజ్ మజీద్ యాసీన్ వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మానవులంతా ఒక్కటేనని మానవాళి సృష్టికర్త దేవుడు కూడా ఒక్కడేనని అన్నారు. మానవులందరూ అన్నదమ్ముల వలే కలసి ఉండాలని చెప్పారు. ఎటువంటి తారతమ్యాలకు అవకాశం కల్పించకూడదని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మజీద్ కమిటీ ఆధ్వర్యలో సన్మానించి ఖురాన్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఎండీ ఫాజిల్, మతపెద్దలు చోటుమియా, అజమాత్ ఖాన్, మాకసూద్, ఇల్యాస్, కౌన్సిలర్ ముంజాల రవీందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అప్పం కిషన్, జోగుల సమ్మయ్య, అంబాల శ్రీను పాల్గొన్నారు.

మున్సిపాలిటీ కార్మికుల సమ్మె



ధర్నా చేస్తున్న కార్మికులు, సిబ్బంది

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి మున్సిపాలిటీలో మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని డిమాండ్‌చేస్తూ సోమవారం నుంచి కార్మికులు, సిబ్బంది సమ్మెకు దిగారు. మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు మూడు నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. వేతనాల కోసం పారిశుద్ధ్య కార్మికులతో పాటు కార్యాలయంలో పనిచేసే సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వేతనాలు రావడం లేదని కార్మికులు సమ్మెబాట పట్టారు. దీంతో మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య పనులు నిలిచిపోయాయి. సోమవారం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, యూనియన్ నాయకులు

భూపాలపల్లి అర్బన్: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీఓ), తెలంగాణ రెవెన్యూ అధికారుల సంఘం(ట్రెసా) క్యాలెండర్లను సోమవారం కలెక్టర్ భవేష్‌మిశ్రా ఆవిష్కరించారు. కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆయా సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. జిల్లాలో అధికారులు నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో యూనియన్ల నాయకులు శామ్యూల్, విజయ్‌భాస్కర్, విజయలక్ష్మి, శ్రీధర్, శైలజ, సునీత, రామ్మోహన్, రజాక్, మహేష్‌బాబు, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారణకు కృషి

డీపీఓ వెంకయ్య



మాట్లాడుతున్న డీపీఓ వెంకయ్య

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారం జాతరలో ప్లాస్టిక్ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీపీఓ వెంకయ్య సూచించారు. మండలంలోని మేడారంలో గల సమ్మక్క భవనంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పెసా కో ఆర్డినేటర్ అధ్యక్షతన 112 గ్రామపంచాయతీల పెసా మొబిలైజర్లతో సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడారం జాతరకు దేశం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారని తెలిపారు. టిఫిన్ సెంటర్లు, ఇతర వాణిజ్య యూనిట్లను నిర్వహించే వారిని ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా క్లాత్ బ్యాగులను వాడి పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధాన్ని అమలు చేయడంతో ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలన్నారు. ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ధాన్యం కేంద్రాల వద్ద దొంగతనం

- నిల్వ ఉన్న వడ్లను అపహరిస్తున్న దుండగులు
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

హసన్‌పర్తి: దొంగలు కొత్త పంథాను ఎంచుకున్నారు. ఇప్పటి వరకు తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడే వారు. అయితే ఇప్పుడు మాత్రం రూట్ మార్చారు. కల్లాల వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని ఎత్తుకెళ్తున్నారు. తన కల్లాల వద్ద నుంచి బస్తాల్లో నింపిన ధాన్యం బస్తాలను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోపీ తెలిపారు. మండలంలోని వంగపహాడ్‌కు చెందిన తెట్టె నాగార్జున్ వరి ధాన్యం పండించాడు. ఆ ధాన్యాన్ని హైవే సమీపంలోని ఓ వెంచర్‌లో ఆరబోశాడు. శనివారం బస్తాల్లో ధాన్యాన్ని నింపాడు. 45 బస్తాల ధాన్యం అమ్మకానికి సిద్ధమయ్యాడు. అయితే ట్రాక్టర్ అందుబాటులో లేకపోవడంతో అక్కడే పెట్టాడు. ఆదివారం సాయంత్రం వచ్చి చూసేసరికి ధాన్యం బస్తాలు మాయమయ్యాయి. రూ.80 వేల విలువైన ధాన్యం ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇదిలా ఉండగా, పదిహేను రోజుల క్రితం ముచ్చర్లలోని నుంచి రెండు ట్రాక్టర్ల ధాన్యం మాయమయ్యాయి. అయితే మరుసటిరోజే బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ముగ్గురికి గాయాలు


జఫర్‌గఢ్: రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం మండలంలోని రేగడి తండా శివారు కేజీ తండా వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని దుర్గ్యానాయక్ తండాకు చెందిన బానోత్ రాములు పని నిమిత్తం జఫర్‌గఢ్‌కు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. మండలంలోని హిమ్మత్‌నగర్‌కు చెందిన మందపురి చంద్రమౌళి, అతని భార్య అనూషతో కలిసి బైక్‌పై స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి జఫర్‌గఢ్ వస్తున్నారు. ఈ క్రమంలో కేజీ తండా వద్ద ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో బైక్‌లపై ఉన్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. రాములు పరిస్థితి విషయంగా ఉన్నట్లు తెలిసింది. రాములు అతివేగంగా నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఢీకొట్టడంతోనే ప్రమాదం జరిగిందని చంద్రమౌళి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


ఖిలావరంగల్‌లో..

ఖిలా వరంగల్: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన ఘటన సోమవారం రాత్రి వరంగల్ ఫోర్టరోడ్డు పై ఏఎస్‌ఎం కళాశాల సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్ ఫోర్ట్‌రోడ్డుపై రెండు బైక్‌లు అతివేగంగా ఢీకొనడంతో ఇద్దరు వాహనచోదకులు గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. విషయం తెలిసిన మిల్స్‌కాలనీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించినట్లు సమాచారం.



గీసుకొండ గుట్టపై ఆలయం, గీసుకొండ లక్ష్మీనర్సింహస్వామి మూల విరాట్





బ్రహ్మోత్సవాలకు వేళాయె..

నేటి నుంచి గీసుకొండ జాతర

- సాయంత్రం 5 గంటలకు గుట్టపైకి చేరనున్న లక్ష్మీనర్సింహస్వామి వారు
- 27వ తేదీన ముగింపు

గీసుకొండ : గీసుకొండ మండల కేంద్ర శివారులో నల్లరాతి గుట్టపై స్వయంభూగా వెలిసిన శ్రీ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు(జాతర) ఈ నెల 23 నుంచి 27 వరకు వైభవంగా సాగనున్నాయి. మంగళవారం సాయంత్రం 5 గంటలకు స్వామివారిని గీసుకొండలోని వేణుగోపాలస్వామి ఆలయం నుంచి స్వామివారిని గుట్టపై ఆలయంలోకి తోడ్కొని వెళ్తారు. అనంతరం రాత్రి 8 గంటలకు అంకురార్పణ, ద్వజారోహణ, కల్యాణోత్సవం జరుపుతామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త అర్చకులు వేదాంతం వెంకటనర్సింహార్యులు, వేదాంతం మురళీకృష్ణమాచార్యులు తెలిపారు. 24న హోమబలిహరణం, తీర్థప్రసాద వినియోగం, 25న పూర్ణాహుతి, జాతర బండ్లు తిరుగుట, స్వామివారికి మొక్కుబడులు సమర్పించడం ఉంటాయని, 26న ఉదయం స్వామివారి సేవలు, కేశ ఖండనం, పుష్పయాగం ఉంటాయని, 27న చివరి రోజు సాయంత్రం స్వామి వారిని గీసుకొండలోని వేణుగోపాలస్వామి ఆలయానికి తోడ్కొని వెళ్లడంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. లక్ష్మీనర్సింహస్వామి మహత్యం అనేక కథల రూపంలో ప్రచారంలో ఉంది. గతంలో పురావస్తుశాఖ వెలికితీసిన చారిత్రక ఆనవాళ్లు ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. స్వామి కొలువైన గీసుకొండ గుట్ట వద్ద రెయిలింగ్, మెట్లు, దిగవన ఆలయ నిర్మాణం, పలు అభివృద్ధి పనులను పలువురు దాతలు చేపట్టారు. భక్తులు ఇబ్బంది కలుగకుండా జాతర విజయవంతానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగుల సాంబరెడ్డి తెలిపారు. అయితే గుట్టపై ఆలయ అభివృద్ధి, జాతర నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయాలని భక్తులు కోరుతున్నారు.

చారిత్రక ఆనవాళ్లకు సాక్ష్యం..

సుమారు 400 అడుగుల ఎత్తులో ఉన్న గుట్టచుట్టూ 70 ఎకరాల ప్రాంతంలో మధ్యశిలా యుగం మొదలు.. శాతవాహనుల కాలానికి సంబంధించిన ఎన్నో చారిత్రక ఆధారాలు బయలపడ్డాయి. 2001లో తొలిసారి గీసుకొండకు చెందిన పురావస్తు పరిశోధకుడు ముత్తినేని రాధాకృష్ణ ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకొచ్చారు. మధ్యరాతియుగానికి సంబంధించిన సూక్ష్మరాతి పనిముట్లు, నవీన శిలాయుగానికి సంబంధించిన గొడ్డళ్లు, నూరే రాళ్ళు, మట్టి పెంకులు, బృహత్‌శిలాయుగపు సమాధులు(మెగాలిథిక్ బరియల్స్) వెలుగు చూశాయి. హైదరాబాద్ నుంచి వచ్చిన పురావస్తుశాఖ అధికారులు పరిశీలన కోసం నాలుగు ట్రెంచ్‌లను తవ్వడంతో మరిన్ని ఆధారాలు వెలుగులోకి వచ్చాయి. మొదటి ట్రెంచ్‌లో బౌద్ధ మతానికి సంబంధించిన స్తూపం బయటపడింది. దీనికి సంబంధించిన ఇటుకలు కూడా వెలుగుచూశాయి. అందులోనే బోధిసత్వుడి తెల్లని ప్రతిమ బయటపడటంతో జిల్లాలోనే మొదటి బుద్దిస్టు సైట్‌గా దీనిని గుర్తించారు. దీంతో అప్పట్లో ఈ ప్రాంతం బౌద్ధ ఆరామాలకు నిలయంగా మారి ఉంటుందని పురావస్తు శాఖ నిపుణులు అభిప్రాయపడ్డారు. శాతవాహనుల సంబంధించిన నాణెం కూడా లభించింది. ఈ విషయం గతంలో పార్లమెంట్‌లో చర్చకు వచ్చింది. అప్పటి కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి అనంతకుమార్ భారత ఆర్కియాలజికల్ సర్వే అధికారులను గీసుకొండ గుట్ట వద్ద అధ్యయనం చేయాలని ఆదేశించారు. అయితే అధికారులు వచ్చి వెళ్లాక ఎవరూ పట్టించుకోకపోవడంతో విషయం మరుగునపడింది. ఇక్కడ లభ్యమైన చారిత్రక అవశేషాలను, ప్రతిమలు, టెర్రకోట బొమ్మలు, రాతి ఆయుధాలను వరంగల్‌లోని పురావస్తు మ్యూజియంలో భద్రపరిచారు. గుట్ట ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించి మరింత క్షుణ్ణంగా పరిశోధనలు చేస్తే చారిత్రక క్రమం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

రమణీయం.. రాములోరి కల్యాణం

- జీడికల్‌లో ఘనంగా సీతారాముల పెండ్లి
- తిలకించి పులకించిన భక్తజనం



సీతారాముల కల్యాణోత్సవంలో తాళిని చూపిస్తున్న అర్చకుడు

లింగాలఘణపురం : మండలంలోని జీడికల్ వీరాచల రామచంద్రస్వామి ఆలయంలో సోమవారం సీతారాముల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. అయోధ్యలో రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా జీడికల్, నవాబుపేట కోదండ రామస్వామి ఆలయాలను అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. జీడికల్‌లో వేదపండితులు భార్గవాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు వేదమంత్రోచ్చారణలతో సీతారాముల కల్యాణం నిర్వహించగా భక్తులు ఆనందోత్సవాల మధ్య తిలకించి తన్మయులయ్యారు. శ్రీరాముడు మాయలేడిని ఇక్కడి లేడిబండ వద్ద సంహరించి సంధ్యావందనం కోసం తన కాలితో నొక్కగా వచ్చిన ఊటనీటి అడుగు నేటికీ జీడికల్‌లో దర్శనమిస్తుంది. అంతటి ప్రాశస్త్యం పొందిన జీడికల్‌లో అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా కల్యాణం నిర్వహించడం భక్తులకు ఆనందదాయకమైంది. వందలాది మంది భక్తులు వీరాచల రామున్ని దర్శించుకున్నారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. దేవస్థాన సిబ్బంది రాములు, భరత్, మల్లేశం భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

మైనర్లతో గంజాయి దందా

- నలుగురి అరెస్ట్, రిమాండ్
- 2,400 గ్రాముల గంజాయి స్వాధీనం



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

హసన్‌పర్తి : ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు ఇద్దరు మేజర్లతో కలిసి మైనర్లు గంజాయి వ్యాపారం చేస్తూ పోలీసులకు దొరికారు. వివరాలను ఎస్సై అశోక్ విలేకరుల ముందు వెల్లడించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం పోతరెడ్డిపేటకు చెందిన మహ్మద్ ఖమ్రుద్దీన్, ఎలకపల్లి అరవింద్‌లు కొంతకాలంగా గంజాయి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. మరో ఇద్దరు మైనర్లను కూడా ఈ వ్యాపారంలో భాగస్వాములు చేసుకున్నారు. జమ్మికుంటకు చెందిన పిట్టల నాగరాజు నుంచి వీరు గంజాయి కొనుగోలు చేసి ఆయా ప్రాంతాల్లో విక్రయాలు చేపడుతున్నారు.

ప్యాకెట్లలో నింపి విక్రయం

కొనుగోలు చేసిన గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లల్లో నింపి వాటిని రూ. 1000కి విక్రయిస్తున్నారు. ముఖ్యంగా కాలేజీ విద్యార్థులే ఈ గంజాయికి బానిసవుతున్నారు. ఇదిలా ఉండగా సోమవారం పిట్టల నాగరాజు నుంచి 2,400 గ్రాముల గంజాయిని రూ.56వేలకు ఖరీదు చేశారు. వాటిని చిన్నిచిన్న ప్యాకెట్లల్లో నింపారు.అయితే హసన్‌పర్తి పెద్ద చెరువు కట్ట సమీపంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద నలుగురు వ్యక్తులు పోలీసులను చూసి పరుగులు పెట్టారు. దీంతో అనుమానంతో పోలీసులు వారిని పట్టుకుని విచారించగా వాస్తవాలు అంగీకరించినట్లు ఎస్సై తెలిపారు.నిందితుల నుంచి 2,400 గ్రాముల నంబర్‌ప్లేట్ లేని బైక్, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

నందనం సొసైటీ డైరెక్టర్ ఆత్మహత్య



శ్రీనివాస్ (ఫైల్)



కిషన్‌రావు(ఫైల్)

ఐనవోలు: నందనం కర్షక సేవా సంఘం డైరెక్టర్, మల్లికార్జునస్వామి ఆలయ మాజీ చైర్మన్ వడిచర్ల శ్రీనివాస్(55) మండల కేంద్రంలో సోమవారం ఉరివేసుకుని మృతి చెందాడు. ఎస్సై గైకాడి అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఆయన నివాసంలో ఉదయం 10 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత భార్య చూసి చుట్టుపక్కల వారితో కలిసి ఉరి నుంచి తప్పించారు. వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు. శ్రీనివాస్ గత పదేళ్లుగా బీపీ, షుగర్ వ్యాధులతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం వ్యాధులు తగ్గడం లేదని తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందినట్లు మృతుడి భార్య అనురాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుమారుడు కమలాకర్ లండన్‌లో ఉండగా, కూతురు శివాని ఉన్నారు. విషయం తెలుసుకున్న డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు-ఎంపీపీ మధుమతి దంపతులు హుటాహుటిన ఎంజీఎం ఆస్పత్రి పోస్టుమార్టం వద్దకు చేరుకుని బోరున విలపించారు. బాధిత కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శ్రీనివాస్ మృతదేహాన్ని సందర్శించి అతని కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్, మార్నేని వెంకటేశ్వర్‌రావు, మహేందర్, సునీల్, రహీంపాషా ఉన్నారు. అలాగే బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి, సంపత్‌కుమార్, జన్ను కుమారస్వామి, సతీష్‌కుమార్ మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.

అనారోగ్య సమస్యలతో మరొకరు..

టేకుమట్ల: అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని రామకిష్టాపూర్(వి)లో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రామకిష్టాపూర్(వి)కు చెందిన అడగాని కిషన్‌రావు(65) రెండేళ్ల క్రితం పక్షవాతంతో బాధపడుతుండేవాడన్నారు. పక్షవాతానికి చికిత్స తీసుకుంటున్నా కోలుకోకపోవడంతో పాటు, మరింత ఆరోగ్యం క్షీణించడంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు సాంబశివుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గట్ల సుధాకర్ తెలిపారు.

అనుమతిలేని మెడికల్ షాపుపై దాడులు

- పీఎంపీపై కేసు నమోదు

ఖిలా వరంగల్: పడమరకోటలో ఓ పీఎంపీ అనుమతిలేకుండా నిర్వహించే మెడికల్ షాపుపై సోమవారం సాయంత్రం డ్రగ్స్ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. అనుమతులేని మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించి పీఎంపీ వైద్యుడు రాజేందర్‌పై కేసు నమోదు చేసి షాపు నుంచి సుమారు రూ.50వేల విలువైన 40 రకాల మందులను స్వాధీనం చేసుకున్నట్లు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు ఎం.అరవింద్‌కుమార్, జె.కిరణ్‌కుమార్ తెలిపారు. వరంగల్ డ్రగ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జి.రాజ్యలక్ష్మి ఆదేశాల మేరకు సోమవారం రాత్రి ఖిలావరంగల్ పడమరకోటలో పీఎంపీ వై. రాజేందర్ అనుమతిలేకుండా నిర్వహిస్తున్న మెడికల్ షాపుపై అధికారులు ఆకస్మికంగా దాడులు చేపట్టారు. పీఎంపీ వైద్యుడిపై డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం 1940 ప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేసి మందులను స్వాధీన పర్చుకున్నట్లు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న సొత్తును మంగళవారం కోర్టులో జమ చేయబడుతుందని వారు పేర్కొన్నారు. లైసెన్స్ లేకుండా డ్రగ్స్ విక్రయించే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. దాడుల్లో డ్రగ్స్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

అంతరాయం లేని విద్యుత్ అందించాలి



మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

జనగామ: వినియోగదారులకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ అందించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ లైన్లలో సాంకేతిక లోపం లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. డీటీఆర్‌లపై ఓవర్‌లోడ్ తగ్గించేలా అవసరమైన చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మూడు నెలలకోసారి 33, 11 కేవీ లైన్ మరమ్మతులు చేయాలన్నారు. విద్యుత్ లైన్‌లో యాక్సిడెంట్లు కాకుండా చూస్తూ సంస్థ అభివృద్ధికి అంకిత భావంతో పని చేయాలన్నారు. ఆపరేషన్ డైరెక్టర్ మోహన్‌రెడ్డి, కమర్షియల్ డైరెక్టర్ సంధ్యారాణి, సీజీఎం ఫైనాన్స్ తిరుపతిరెడ్డి, జిల్లా ఎస్ఈ టి.వేణుమాధవ్, డీఈ, ఏడీఈ, ఏఈ పాల్గొన్నారు.

దాడి చేసిన కేసులో ఏడుగురికి జైలు

- ఒక్కొక్కరికి రూ.1100 జరిమానా

మరిపెడ /మరిపెడ రూరల్: చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామానికి చెందిన ఏడుగురికి తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత ఏడాది జైలుశిక్షతో పాటు జరిమానా విధించినట్లు మరిపెడ ఎస్సై ఎస్‌కే తహేర్‌బాబా తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 2015లో జయ్యారం జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం వంట చేసే విషయంలో మహిళా గ్రూపుల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. ఓ గ్రూప్ సంఘం సభ్యులు మరో గ్రూప్ సంఘం సభ్యులపై దాడి చేసి గాయపర్చారు. ఈ సంఘటనపై ఓ మహిళా సంఘం సభ్యురాలు మణెమ్మ 2015లో మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసుపై అప్పటి ఎస్సై కృష్ణకుమార్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశాడు. కోర్టులో సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.గణేష్ ఆనంద్ కేసు వాదించారు. ఈ కేసు పూర్వాపరాలు పరిశీలించిన తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి సరిత నాన్నం నర్సమ్మ, అప్పనబోయిన పాపమ్మ, అప్పనబోయిన మదనమ్మ, మంకెన సైదమ్మ, దుండిగల భద్రమ్మ, గంగరబోయిన పుల్లమ్మ, అండెం ఉప్పల్‌రెడ్డిలకు ఏడాది జైలు శిక్ష విధించడంతో పాటు ఒక్కొక్కరికి రూ.1100 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సాగు.. బాగుండాలంటే

- నియంత్రణ చర్యలు.. యాజమాన్య పద్ధతులు
- కలుపు మందుల వాడకంలో ఉద్యానశాఖ అధికారి సూచనలు

కూరగాయ పంటల్లో కలుపు మొక్కల నివారణతో దిగుబడులు



మిరప పంటలో రైతులకు సూచనలు ఇస్తున్న ఉద్యానశాఖ అధికారి రమేశ్ (ఫైల్)

చెన్నారావుపేట: కూరగాయల సాగు.. లాభసాటి వ్యవసాయం. వరి, పత్తి, తదితర సంప్రదాయ పంటల సాగుకు ప్రత్యామ్నాయం. తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు గడించే పంట. అయితే ఈ పంటలో రైతులు కలుపు మొక్కలపై దృష్టి సారించాలి. అప్పుడే ఆశించిన మేర దిగుబడులు లభిస్తాయి. ఈ నేపథ్యంలో రైతులు కలుపు మొక్కల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఉద్యానశాఖ అధికారి దయ్యాల రమేష్ వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

- నీరు, పోషకాలు, సూర్యరశ్మి, స్థలం కోసం కూరగాయల మొక్కలతో కలుపు మొక్కలు పోటీ పడుతాయి. అంతర కృషి పనులకు ఆటంకం కలిగిస్తాయి. తద్వారా పంట దిగుబడి, నాణ్యతను తగ్గిస్తాయి. కలుపు మొక్కలు అనేక చీడపీడలకు అతిథేయ మొక్కలుగా ఉండి చీడపీడల సమస్యను తీవ్రతరం చేస్తాయి. పంట కోత సమయంలో కూడా కలుపుతో ఇబ్బందులు ఎదురవుతాయి.

కలుపు మొలకెత్తిన తర్వాత..

పంట, కలుపు మొలచిన తరువాత కలుపు 3-4 ఆకుల దశ చేరిన తరువాత పంటపై, కలుపుపై పిచికారీ చేయాలి. ఉదాహరణకు క్విజాలోఫాస్ ఇథైల్, ప్రొపాక్విజఫాస్ నారు మడుల్లో కలుపు యాజమాన్యం చేపట్టాలి.

కలుపు రహిత నారుమడి తయారు చేసే విధానం..

నారుమడుల్లో పంట విత్తనాలు విత్తుటకు రెండు నుంచి మూడువారాల ముందు నీటి తడిని అందించి మొలిచిన కలుపును అవశేషాలు మిగల్చకుండా కలుపు నాశిని పిచికారీ చేసి కలుపును నివారించాలి. ఆ తరువాత కూరగాయ విత్తనాలను విత్తుకోవాలి.

కలుపు మందుల వాడకంలో గుర్తుంచుకోవాల్సిన అంశాలు

పంటకు సిఫారసు చేసిన కలుపు మందులను సరైన మోతాదులో, సరైన సమయంలో వాడాలి. కలుపు మందులను వాడినప్పుడు పంట విత్తిన/నాటిన 25-35 రోజుల తర్వాత పనిముట్ల ద్వారా అంతరకృషి తప్పనిసరిగా చేయాలి. పొలంలో పదును బాగా ఉన్నప్పుడే కలుపు మందులు చల్లొద్దు. కలుపు మందులను ఉదయం లేదా సాయంకాలం వాడాలి. కలుపు మందులు వాడిన తర్వాత స్ప్రేయర్‌ను 3-4 సార్లు శుభ్రంగా కడగాలి. కలుపు మందులను ఇతర సస్యరక్షణ మందులతో కలిపి వాడొద్దు. హ్యాండ్ స్ప్రేయర్ ఉపయోగించి మాత్రమే పిచికారీ చేయాలి. ఫ్లడ్ జెట్ లేదా ఫ్లాట్ ఫ్యాన్ నాజిల్ ఉపయోగించాలి. కలుపు నాశక మందులు ఒకే రకమైనవి ఎల్లప్పుడు వాడొద్దు. అలా వాడితే కలుపు మొక్కలు ఆ మందును తట్టుకునే శక్తిని అలవరుచుకుంటాయి.

నియంత్రించడానికి తోడ్పడే చర్యలు

వేసవి లోతు దుక్కులు, సిఫారసు చేసిన మొక్కల సాంద్రత పాటించడం, అంతరపంటల సాగు, పంట మార్పిడి విధానం అవలంబించాలి. కూరగాయల్లో నల్ల లేదా వెండి రంగు ప్లాస్టిక్ షీటు లేదా వరిగడ్డితో మల్చింగ్ చేయడం, డ్రిప్ పద్ధతి ద్వారా నీటిని అందించాలి.

విత్తిన 20-30 రోజుల తర్వాత కూలీలతో కలుపు తీయాలి.

తక్కువ మోతాదు గల మందు తేలిక పాటి ఎర్ర నేలలకు, ఎక్కువ మోతాదు గల మందు బరువైన నల్ల నేలలకు విత్తిన 20-30 రోజుల తర్వాత ఒకసా రి కూలీలతో కలుపు తీయాలి. ఖాళీ మందు డబ్బాలు, సీసాలు, కవర్లను వెంటనే నాశనం చేయాలి.

కూరగాయల పంటలపై కలుపు మందును వాడినప్పుడు సూచించిన కాలపరిమితి తర్వాతనే పంటను కోయాలి. కలుపు నిర్మూలనకు పరిమితంగా రసాయన మందులను వాడుతూ, వేసవి లోతు దుక్కులు, అంతర కృషి వంటి సేద్య పద్ధతులు పాటిస్తూ సమగ్ర కలుపు యాజమాన్యం అవలంబిస్తే పర్యావరణ పరిరక్షణతో పాటు అధిక దిగుబడులు పొందొచ్చు.

కలుపు మొక్కలు మూడు రకాలు..

- కలుపు మొక్కలు మూడు రకాలు ఉంటాయి. గడ్డి జాతి, తుంగ జాతి, వెడల్పాటి ఆకులు జాతి గల కలుపు మొక్కలు ఉంటాయి. అలాగే, కలుపు నాశకాలు కొన్ని గడ్డిజాతిని నాశనం చేసేవి. మరికొన్ని వెడల్పాటి ఆకులు గల కలుపును నాశనం చేసేవి ఉంటాయి.
- కూరగాయలను అంతర పంటగా సాగుచేస్తున్నప్పుడు ఒక కూరగాయ గడ్డి జాతికి చెందినది మరో కూరగాయ వెడల్పాటి ఆకులు గల పంట అయితే కలుపు మందుల వాడకంలో చాలా జాగ్రత్త అవసరం.
- ఉపయోగించే సమయాన్ని బట్టి కలుపు నాశకాలు మూడు రకాలు. ఈ రకమైన కలుపు మందులను పంట, కలుపు మొలవక ముందు అనగా విత్తిన, నాటిన 24-48 గంటలలోపు మంచి తేమ గల నేలపై పిచికారీ చేయాలి. ఉదాహరణకు పెండివిథాలిన్ ఈ రకమైన కలుపు మందులు వాడినప్పుడు అన్ని రకాల కూరగాయ పంటల్లో అవసరమైనప్పుడు 25-40 రోజుల మధ్య ఒకసారి అంతరకృషి చేయడం లేదా కూలీలతో కలుపు తీయాలి.

కలుపు యాజమాన్యం

టమాట: కూరగాయాలు విత్తిన, నాటిన 24-48 గంటల లోపు పెండిమిథాలిన్ 38.7% సీఎస్‌ను 600-700 మిల్లీలీటర్ 3.0-3.5 మి.లీ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మెట్రిబుజిన్ 300 గ్రాములు 1.5 లీటరు నీటిలో కలిపి నాటిన 15-20 రోజుల తర్వాత పిచికారీ చేయాలి.

వంకాయ: పెండిమిథాలిన్ 38.7% సీఎస్‌ను ఎకరానికి 600-700 మి.లీ మోతాదుతో 3.0-3.5 మి.లీ నీటిలో కలిపి నాటిన 24-48 గంటల లోపు పిచికారీ చేయాలి.

మిరప: పెండిమిథాలిన్ 38.7% సీఎస్‌ను 600-700 మి.లీ మోతాదుతో ఎకరానికి 3.0-3.5 మి.లీ నీటిలో నాటిన 24-48గంటల లోపు పిచికారీ చేయాలి.

ఉల్లి: ఆక్సిఫ్లోర్ ఫెన్ 23.5% ఈసీ 300-400 మి.లీ మోతాదుతో ఎకరానికి 1.5-2.0 మి.లీ నీటిలో కలిపి నాటిన 24-48 గంటల లోపు పిచికారీ చేయాలి.

పెండిమిథాలిన్ 38.7% సీఎస్‌ను 600-700 మి.లీ మోతాదుతో ఎకరానికి 3.0-3.5 మి.లీ నీటిలో నాటిన 24-48గంటల లోపు పిచికారీ చేయాలి.

క్విజలోఫాస్ ఇథైల్ 5% ఈసీ 400 మి.లీ మోతాదుతో ఎకరానికి 2.0 మి.లీ నీటిలో కలిపి నాటిన 15-20 రోజుల తర్వాత పిచికారీ చేయాలి.

ప్రొపాక్విజాఫాస్ 10% ఈసీ 250 మి. లీ మోతాదుతో ఎకరానికి 1.25 మి.లీ నీటిలో కలిపి నాటిన 15-20 రోజుల తర్వాత పిచికారీ చేయాలి.